క్లుప్తంగా

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం


సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న దృశ్యం

కవిటి: ప్రగడపుట్టుగలోని కోదండ రామాలయం 54వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చక్రధర పెరుమాళ్లస్వామి ఆలయం ప్రధానార్చకులు సత్యన్నారాయణ స్వామిచే ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బల్లెడ ఎర్రప్ప, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సంగీత గాత్రకచేరీ ఆద్యంతం అలరించింది.

రూ. పది వేల ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ గ్రామానికి చెందిన బుట్ట గంగాధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా అతని భార్య సరళ ఆస్పత్రిపాలైంది. దీంతో ముగ్గురు ఆడపిల్లలు ఒంటరయ్యారు. విషయం తెలుసుకున్న మన సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. రూ. పదివేలు సేకరించారు. ఈ మొత్తాన్ని పిల్లలకు శనివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తారక్, మిన్ను పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సత్కారం


పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్లె నాగేశ్వరరావుకు అరుదైన గౌరవ దక్కింది. రాజమండ్రిలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ సౌజన్యంతో ఈ నెల నాలుగో తేదీన నిర్వహించిన జాతీయ పురస్కారోత్సవం -2025లో ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ సాహిత్యంపై మక్కువతో సమాజహిత రచనలకు, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా చేస్తున్న సాహిత్యసేవలను గుర్తిస్తూ పురస్కారాన్ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, గజల్ శ్రీనివాస్ అందజేశారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా


డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రం

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేపట్టినట్టు పట్టణ ఎస్ఐ ఎం.ముకుందరావు తెలిపారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో, సమీప పంటపొలాలు, తోటల్లో పేకాట శిబిరాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయోమోనని శనివారం డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక తనిఖీలు చేశామన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు బయటపడలేదని చెప్పారు.

జలజీవన్ పనులను త్వరగా పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: పలాస నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేసి ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులను కోరారు. శ్రీకాకుళంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలో శనివారం ఎస్ఈ ఇషాన్ బాషాతో పాటు పలువురు అధికారులతో ప్రస్తుతం చేపడుతున్న పనులపై సమీక్షించారు. గుత్తేదారులతో మాట్లాడి పనులను వేగవంతం చేయించాలని కోరారు. డీఈ సూర్యనారాయణ, జలజీవన్ ప్రాజెక్టు డీఈ ఆశాలత ఉన్నారు.


మంచినీరు వృథా!



కంచిలి: మండల కేంద్రం కంచిలి గ్రామానికి మంచినీరు అందించే రక్షిత నీటి పథకం ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతుంది. స్థానిక బీసీ వసతి గృహం ఆవరణలో ఉన్న ట్యాంకును రోజూ మోటార్ ద్వారా నింపుతారు. అయితే అది నిండిన విషయాన్ని ఆపరేటర్ గమనించకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. హాస్టల్ సిబ్బంది సమాచారం ఇచ్చేవరకూ ఆపరేటర్ రాకపోవడంతో నీరు వృథా అవుతుంది. దీన్ని పంచాయతీ యంత్రాంగం సరిచేయకపోతే వేసవిలో నీటి కోసం ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వన్యప్రాణులకు.. రక్షణ కరువు!

- అటవీ ప్రాంతం, కొండలపై అడుగంటిన నీటివనరులు
- దాహార్తి తీర్చుకోవడానికి వనాలను వదిలి జనాల్లోకి వస్తున్న వన్యప్రాణులు
- కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న జైనం


వన్యప్రాణులకు ఆవాసంగా ఉన్న సూదికొండ

ఇచ్ఛాపురం: మండుతున్న ఎండల తీవ్రతతో నీటి వనరులు అడుగంటుతున్నాయి. ఈ ప్రభావం వన్యప్రాణులపై పడుతుంది. అటవీ ప్రాంతం, కొండలపై నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. దీంతో దాహార్తితో అలమటిస్తున్న వన్యప్రాణులు నీటి కోసం వెతుకులాడుతూ జనావాసాల్లోకి వస్తుండగా.. వీధి కుక్కలు వాటిపై దాడిచేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామానికి ఆనుకొని ఉన్న పీర్లకొండ, సూదికొండల నడుమ ఉన్న కొద్దిపాటి అటవీ ప్రాంతంలో కుందేళ్లు, జింకలు, అడవి పందులు, ఎలుగుబంట్లు, కోతులు, నెమళ్లు, నక్కలు, హైనాలు ఉన్నాయి. వీటి సంతతి గతం కంటే గణనీయంగా పెరుగుతూ వస్తున్నట్టు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. శీతాకాలం, వర్షా కాలంలో అటవీ ప్రాంతంలో నీరు లభ్యం కావడంతో వన్యప్రాణులకు ఇబ్బంది ఉండేదికాదు. అలాగే బాహుదానది పరీవాహక ప్రాంతానికి వచ్చి దాహార్తిని తీర్చుకుని మరలా కొండల్లోనికి వెళ్లిపోయేవి. అయితే ప్రస్తుతం వేసవి కావడంతో కొండలపై కూడా నీటి వనరులు ఇంకిపోయాయి. అలాగే బాహుదా నదీలో కూడా నీరు లేదు. ఇసుకను అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ తవ్వేయడంతో బాహుదానదిలో నీరు లభ్యంకాక వన్యప్రాణులు నీటి కోసం వెదుకులాడుతూ జనావసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. కొన్ని సందర్భాంలో దారి తప్పి మెయిన్ రోడ్ పైకి వచ్చేటప్పుడు వాహనాలను చూసి బెదిరిపోయి వాటికింద పడి మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఇటీవల నీటి కోసం జనావాసాల్లోకి వచ్చిన రెండు జింకలు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయాయి. మార్చి 26వ తేదీన రత్తకన్న గ్రామ సమీపంలో తోటల వద్ద నీటి కోసం వచ్చిన నాలుగు సంవత్సరాల జింకపై కుక్కలు దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయింది. అలాగే అక్కడికి మూడు రోజులు వ్యవధిలోనే.. మార్చి 29వ తేదీన మూడు సంవత్సరాల వయస్సు గల మరో ఆడ జింక ఉదయం సమయంలో నీటి కోసం రత్తకన్న గ్రామంలోనికి రావడంతో వీధి కుక్కలు దానిని వెంబడించి దాడి చేయడంతో మృత్యువాత పడింది. వేసవి ఎండల తీవ్రత మరింత పెరుగుతుండడంతో జింకలతోపాటు మరికొన్ని వన్యప్రాణులు కూడా నీటి కోసం జనావాసాల్లోకి వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండలు, అటవీ ప్రాంతాల్లో తొట్టేలను ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపితే వన్యప్రాణులకు రక్షణ కల్పించినవారవుతారని ప్రజలు సూచిస్తున్నారు.


మార్చి 29న శునకాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన జింకను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది


మార్చి 26న కుక్కల దాడిలో మృతిచెందిన జింక

నీటి వనరులు చేకూర్చుతాం..

వన్యప్రాణు దాహార్తి తీర్చదానికి చర్యలు తీసుకుంటున్నామని ఫారెస్టు బీట్ అధికారి పి.భానుమూర్తి వెల్లడించారు. అటవీశాఖ సిబ్బంది పరిధిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి సాసర్‌పిట్‌లు, నీటిగుంటలను ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపుతామన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో వన్యప్రాణులు జీవనం సాగిస్తున్న ప్రాంతం అటవీశాఖ భూబాగానికి చెందింది కాదన్నారు. ఇది రెవెన్యూ భూభాగం పరిధిలో ఉండడంతో ప్రత్యేకంగా అటవీశాఖ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోలేమని స్పష్టం చేశారు.

తహసీల్దార్ ఏమన్నారంటే..

ఇదే విషయాన్ని స్థానిక తహసీల్దార్ ఎన్.వెంకటరావు దృష్టికెళ్లగా.. మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ఉపాధిహామీ పథం ద్వారా నీటికుంటలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వన్యప్రాణుల రక్షణకు సంబంధిత అధికారుల నుంచి రెవెన్యూ సిబ్బందికి ఎటువంటి సమాచారం రాలేదన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు



పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వీడ్కోలు సభ జరిగింది. మూడేళ్లు కలిసి చదువుకున్న పిల్లలంతా వీడిపోతున్నామనే బాధను వ్యక్తం చేశారు. ఫైనలియర్ పిల్లలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

–కాశీబుగ్గ

ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలోని దేవాలయాలు, ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ చెప్పారు. కేదారిపురం, బెన్నుగానిపేట, బాలకృష్ణాపురం, జగన్నాథపురం గ్రామాల్లో సీసీ కెమెరాలను శనివారం ఏర్పాటు చేశారు. స్థానిక ఆలయ కమిటీ నిర్వాహకులు ముందుకు వచ్చి దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

–ఇచ్ఛాపురం రూరల్

ఎమ్మెల్సీ పరామర్శ



సోంపేట మండలం గొల్లూరు ఉపసర్పంచ్ తెప్పల సావిత్రి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పలాసపురం, గొల్లూరు సర్పంచ్‌లు తడక జోగారావు, పిన్నింటి ఈశ్వరరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

–సోంపేట

వైభవంగా కుతారి చండీయాత్ర


అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ


అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

కవిటి: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం కుతారిచండీ అమ్మవారి యాత్ర మండలంలోని వింధ్యగిరిలో శనివారం కన్నుల పండువగా జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణర్థం అమ్మవారికి చండీహోమం చేపట్టారు. మధ్యాహ్నం సుమారు పది వేల మందికి అన్నదానం చేశారు. మొక్కుబడులు తీర్చుకునే క్రమంలో మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందిలేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఒడిశాకు చెందిన దివ్యాంగ కళాకారులచే ఏర్పాటు చేసిన గాత్రకచేరి అలరించింది. పోలీసులు 25 మందితో సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రాజపురం ప్రభుత్వవైద్యశాఖ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

రోడ్డు పనులు పరిశీలన


కంచిలి: రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు


సోంపేట: స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కంచిలి: నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని ఎంపీడీవో వి.తిరుమలరావు పేర్కొన్నారు. పల్లెపండుగ పనుల్లో భాగంగా రెండో దశలో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో పెద్దశ్రీరాంపురం గ్రామంలో చేపడుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తేదారునికి పలు సూచనలిచ్చారు.

సోంపేట: పలాసపురం పంచాయతీ పరిధి లక్కవరం గ్రామంలోని హరిజన వీధి నుంచి అమ్మవారి దేవాలయం వరకు రోడ్డు వేయడానికి స్థలాన్ని సర్పంచ్ తడక జోగారావు శనివారం పరిశీలించారు. వార్డ్ మెంబర్ దున్న బాలరాజు ఉన్నారు.

ఏజీపీని నియమించాలని వినతి


డీఆర్వో వెంకటేశ్వరరావును కలిసిన తిరుపతిరావు

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టుకు ఏజీపీని నియమించాలని శ్రీకాకుళం డీఆర్వో వెంకటేశ్వరరావుకు కలిసి విన్నవించినట్టు పలాస కోర్టు ఇన్‌చార్జి ఏజీపీ సంపతిరావు తిరుపతిరావు శనివారం తెలిపారు. ప్రస్తుతం కోటబొమ్మాళి కోర్టు ఏజీపీగా తాను పనిచేస్తున్నానని.. రెండు కోర్టుల వ్యవహారాలు కష్టంగా ఉండడంతో పలాస కోర్టుకు నూతన ఏజీపీ నియమించాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కవిటి మండల కార్యవర్గం నియామకం

కవిటి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కవిటి మండల కార్యవర్గాన్ని ప్రకటిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యక్షులుగా దువ్వు కృష్ణారెడ్డి, దుద్ది ధర్మారావు, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్ పురియా, కర్రి గోపయ్య, బడ్డాయి మురళీ, సనపల శ్రీనివాసరావు, కార్యదర్శులుగా వజ్జ ప్రసాదరావు, కరగాన వల్లభరావు, ధూపాన నేతాజీ, చీకటి బోసు, కుమార్ మోహన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బలగ డొంబురు, నర్తు జగన్నాథరావు, పిరియా వైకుంఠరావు, దేవాడ దుర్యోధన, ఉప్పాడ పద్మనాభం, బదకల భాస్కరరావు, లొట్టి సోమేష్, సీరపు భూపతి నియమితులయ్యారు.

నవమి ఉత్సవాలకు వేళాయె..


ఇచ్ఛాపురం రూరల్: ఉత్సవాలకు ముస్తాబైన ఈదుపురం రామాలయం


వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి శ్రీరామాలయంలో సిద్ధమైన ఉత్సవ మూర్తులు


టెక్కలి: శంభానవీధిలో ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక


ఇచ్ఛాపురం రూరల్: శ్రీరామ దీక్షాపరుల ప్రత్యేక పూజలు


టెక్కలి: శంభానవీధిలోని శ్రీరామ ఆలయంలో ఉత్సవాలకు ముస్తాబు చేసిన శ్రీరామ, సీత, లక్ష్మణ, ఆంజనేయుడు ఉత్సవ మూర్తులు

ఇచ్ఛాపురం రూరల్: శ్రీరామ నవమి ఉత్సవాలకు గ్రామాలు సన్నద్ధమయ్యాయి. ఆదివారం నిర్వహించే ఉత్సవాల కోసం రామాలయాలు సుందరంగా ముస్తాబు చేశారు. టి.బరపురం, డొంకూరు, ఈదుపురం గ్రామాల్లో ఉత్సవాలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈదుపురంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం, యజ్ఞాన్ని నిర్వహించనున్నారు.

వజ్రపుకొత్తూరు: పూండి ఉద్దానం ప్రాంతంలో శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరిండమే కాకుండా ప్రత్యేక పూజల కోసం సీతారాముల మూల విరాట్‌లను పూల మాలలు, నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. పాత టెక్కలి సీతారామ ఆలయంతో పాటు అమలపాడు, పొల్లాడ, దేవునల్తాడ, కొత్తపేట గ్రామాల్లో ఆలయ అభివృద్ధి కమిటీలు ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

టెక్కలి: శ్రీరామ నవమి సందర్భంగా ఉత్సవాలకు టెక్కలి మండలంలో పలు శ్రీరామ ఆలయాలు ఘనంగా ముస్తాబయ్యాయి. టెక్కలి శంభాన వీధిలోని శ్రీరామ ఆలయంలో ఉత్సవ మూర్తులతో పాటు ఆలయ ప్రాంగణంలో వేదికలను ఏర్పాటు చేశారు.


వజ్రపుకొత్తూరు రూరల్: విద్యుత్ కాంతులతో మెరుస్తున్న నువ్వలరేవు గ్రామ ప్రధాన వీధి

నువ్వలరేవులో సర్వం సిద్ధం

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో 12 రోజులుగా జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో ప్రధాన ఘట్టమైన సీతారాముల కళ్యాణానికి సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలతో గ్రామం కళకళలాడుతోంది. గ్రామం ముఖద్వారం నుంచి బృందావతి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలను అమర్చారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళి

భారత ప్రజలకు లభించిన అమూల్యరత్నం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వక్తలు కొనియాడారు. దేశంలోనే అగ్రశ్రేణీ పార్లమెంటేరీయన్‌గా గుర్తింపు పొందారన్నారు. కులరహిత సమాజం కోసం పాటుపడిన మహనీయుడుగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా ఎనలేని సేవలందించారన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛందసంస్థల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్


కవిటి: రాజపురంలో జగ్జీవనరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


కవిటి: కొత్తపుట్టుగలో జగ్జీవనరామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


పలాస: కాశీబుగ్గ అంబేడ్కర్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి స్థానికుల నివాళులు


కాశీబుగ్గ: జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


కాశీబుగ్గ: హరిజన వీధిలో జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దళితసంఘాల నాయకులు


వజ్రపుకొత్తూరు: జగజ్జీవన్‌రామ్ చిత్ర పటానికి వెలుగు సిబ్బంది నివాళులు


కంచిలి: బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వి.తిరుమలరావు తదితరులు